క్లుప్తంగా

ఏసు మార్గం అనుసరణీయం

గన్నవరం రూరల్: ఏసుక్రీస్తు మార్గం సర్వ మానవాళికి అనుసరణీయమని విజయవాడ మేత్రాసనం రెవరెండ్ ఫాదర్ సుధాకర్ చెప్పారు. ముస్తాబాద కొండపై ఉన్న ఏసు దివ్యకారుణ్యమూర్తి పుణ్యక్షేత్ర మహోత్సవాలు మంగళవారం రెండో రోజు వైభవంగా కొనసాగాయి. ఉదయం ఆరాధన, స్వస్థత ప్రార్థనలు అనంతరం దివ్యబలిపూజ సమర్పించారు. సాయంత్రం రీజనల్ సుపీరియర్ రెవరెండ్ ఫాదర్ బి.బాలాజి ఆధ్వర్యంలో సమష్టి దివ్య బలిపూజ జరిగింది. చిన్న ముస్తాబాద గాయక బృందం పాడిన భక్తి గీతాలు ఆకట్టుకున్నాయి. స్థానిక విచారణ గురువులు రెవరెండ్ ఫాదర్ ఎం.బాలజోసెఫ్ ఆంతోని పర్యవేక్షణలో భక్తులకు ప్రసాద వితరణ జరిగింది.

సొసైటీ సభ్యుడికి ఆర్థిక సాయం

ఉంగుటూరు: పొట్టిపాడు పీఏసీఎస్ సభ్యుడు అట్లూరి సత్యనారాయణ(82) మరణించడంతో మట్టి ఖర్చుల నిమిత్తం రూ.10వేలు అతని కుమారుడు జోషి మధుకు సొసైటీ అధ్యక్షుడు పఠాన్ ముస్తఫా మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ముస్తఫా మాట్లాడుతూ పేద రైతుల శ్రేయస్సుకు ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచనలతో సొసైటీల ద్వారా ఈ కార్యక్రమాన్ని చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో సీఈఓ కాలీషా, డైరెక్టర్ భుక్యా హనుమంతు, కడియాల బాబు పాల్గొన్నారు.

అందుబాటులో పచ్చిరొట్ట విత్తనాలు

గన్నవరం రూరల్: మండలంలోని రైతులకు పచ్చిరొట్ట విత్తనాలు అందుబాటులో ఉన్నాయని ఎంఏఓ ఎస్ఎల్ తేజస్వి చెప్పారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ 127క్వింటాళ్ల జీలగ, 27క్వింటాళ్లు పిల్లి పెసర, 20క్వింటాళ్ల జనుము అందుబాటులో ఉన్నాయన్నారు. రైతులు ఆర్‌బీకేల ద్వారా తమ పేర్లు నమోదు చేసుకుని విత్తనాలు తీసుకోవచ్చని వివరించారు.

పేదలకు అండగా జగన్

పెనమలూరు: పేదలకు అండగా జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం ఉందని వైఎస్సార్ సీపీ జిల్లా యువజన విభాగం ప్రధాన కార్యదర్శి బంగారు నాగేంద్రబాబు చెప్పారు. గంగూరులో మంగళవారం మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని పార్టీ నేతలు, గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లతో నిర్వహించారు. ఈ సందర్భంగా సంక్షేమ పథకాల బ్రోచర్లు ప్రతి ఇంటికీ అందజేశారు. కార్యక్రమంలో నేతలు చిట్టూరి సుబ్బారావు, వల్లూరు యేషయ్య, వనజాక్షి, పమిడిమొక్కల రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో పని చేయాలి

ఉంగుటూరు: సమన్వయంతో పని చేసి అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని ఎంపీపీ వడ్లమూడి సరోజిని అన్నారు. స్థానిక స్త్రీ శక్తి భవనంలో మంగళవారం మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. పలు శాఖల అధికారులు తమ శాఖల ప్రగతిని వివరించారు. ప్రజాప్రతినిధులు సమావేశం దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను అధికారులతో చర్చించి త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. జగనన్న లేఅవుట్లలో అంతర్గత రహదారులు, బోర్, కల్వర్టు నిర్మాణం, మౌలిక సదుపాయాల కల్పనకు మండల పరిషత్ నిధులు రూ.69.4 లక్షల అంచనాల పనులకు ఆమోదించారు. కార్యక్రమంలో గన్నవరం ఏఎంసీ చైర్‌పర్సన్ అంజిలీకుమారి, ఎంపీడీఓ శేషగిరిరావు, ఎంపీటీసీలు, సర్పంచులు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

కంకిపాడు సీఐ సస్పెన్షన్



కంకిపాడు: కంకిపాడు సీఐ ఎస్.పరమేశ్వర్ సస్పెన్షన్‌కు గురయ్యారు. ఈ మేరకు ఎస్పీ జాషువా సస్పెన్షన్ ఉత్తర్వులు మంగళవారం జారీచేశారు. సీఐ పరమేశ్వర్ గత నవంబర్ నుంచి కంకిపాడులో సీఐగా విధులు నిర్వహిస్తున్నారు. కంకిపాడు పీఎస్ పరిధిలో శాంతి భద్రతల పర్యవేక్షణలో విఫలమైనందుకు క్రమశిక్షణలో భాగంగా సీఐని సస్పెన్షన్ చేశారు. గన్నవరం సీఐ కనకారావుకు కంకిపాడు ఎటాచ్‌మెంట్ ఇచ్చారు.

పనులు వేగంగా చేయాలి

పటమట(విజయవాడతూర్పు): నగరంలో వీఎంసీ చేపట్టిన పలు అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తిచేసి నగరవాసులకు అందుబాటులోకి తీసుకురావాలని కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ చెప్పారు. కృష్ణలంక రాణిగారితోట రిటైనింగ్ వాల్ బ్యూటిఫికేషన్ పార్కు, జాతీయ రహదారి వెంబడి ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పార్కును మంగళవారం ఆయన పరిశీలించారు. పనులపై అధికారులు మరింత దృష్టి సారించాలని ఆదేశించారు. పనుల్లో జాప్యం జరిగితే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అంబేడ్కర్ పార్కు సుందరంగా తీర్చిదిద్దాలన్నారు. పార్కులో పచ్చదనం పెంపుపై ఉద్యానవన విభాగం అధికారి దృష్టి సారించాలని కోరారు. చీఫ్ ఇంజినీర్ ఎం.ప్రభాకరరావు, డిప్యూటీ సిటీ ప్లానర్ (ప్లానింగ్) జుబిన్ శిరన్ రాయ్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు ఏఎస్ఎన్ ప్రసాద్, వి.చంద్రశేఖర్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కరీముల్లా, ఎస్ఈ నరసింహమూర్తి, ఏడీ హెచ్ శ్రీనివాసు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

రైతులకు అండగా రాష్ట్ర ప్రభుత్వం

- మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం
- రైతులపై చంద్రబాబు కపట నాటకం
- ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి



పెదపులిపాకలో తడిసిన పంటలు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పార్థసారథి

పెనమలూరు: అకాల వర్షాల కారణంగా రైతుల చేతికి అందివచ్చిన పంటలకు నష్టం జరిగిందని, సీఎం ఆదేశాల మేరకు ప్రతి రైతుకు న్యాయం జరిగే విధంగా చర్యలు చేపట్టామని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి అన్నారు. ఆయన పెదపులిపాక గ్రామంలో అకాల వర్షాల కారణంగా దెబ్బతిన్న జొన్న, మొక్కజొన్న, ధాన్యాన్ని మంగళవారం పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుందన్నారు. పంటలు నష్టపోయిన పరిస్థితులను క్షేత్రస్థాయిలో పరిశీలించటానికి ప్రభుత్వం ప్రతి జిల్లాకు ఒక ఐఏఎస్ అధికారిని నియమించిందన్నారు. ప్రాథమిక సర్వేలో పెనమలూరు నియోజకవర్గంలో వరి 400 ఎకరాలు, జొన్న 850 ఎకరాలు, మొక్కజొన్న 800 ఎకరాలు దెబ్బతిందన్నారు. అధికారులు పూర్తి స్థాయిలో ఎన్యూమరేషన్ చేసి రైతులకు పంట నష్టం అందే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. అధికారులు పంట పొలాల్లోకి వచ్చి పంటలు ఏ మేరకు దెబ్బతిన్నాయో పరిశీలించి కొనుగోలు చేస్తారన్నారు. అనంతరం పెదపులిపాక సచివాలయ ప్రాంగణంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే పార్థసారథి ప్రారంభించారు. ఏపీ మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో క్వింటాకు కనీస మద్దతు ధర రూ.1,962 ఇస్తామన్నారు. మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ప్రభుత్వం ఏర్పాటు చేయగానే బహిరంగ మార్కెట్‌లో కూడా మొక్కజొన్నకు ధర పలుకుతుందన్నారు.

రైతులకు న్యాయం చేయటమే ప్రభుత్వ లక్ష్యం

రైతులపై చంద్రబాబు కపటనాటకం ప్రదర్శిస్తున్నాడని ఎమ్మెల్యే పార్థసారథి ఆరోపించారు. అకాల వర్షాల కారణంగా రైతులు ఇబ్బందులు పడుతుంటే చంద్రబాబు పనికిమాలిన రాజకీయం చేసి రైతులను ఆందోళనకు గురి చేసే విధంగా ప్రవర్తిస్తున్నాడని ఖండించారు. చంద్రబాబు 14 ఏళ్లు సీఎంగా ఉన్న కాలంలో ఏనాడైనా రైతులకు పంటల బీమా ఇచ్చాడా అని ప్రశ్నించారు. చంద్రబాబు, టీడీపీ నేతల తాటాకు చప్పుళ్లను ప్రభుత్వం పట్టించుకోదని, రైతులకు న్యాయం చేయటమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ డీఎం మురళీకిషోర్, పెదపులిపాక సర్పంచి గుంటూరు శ్రీనివాసచౌదరి, చోడవరం సర్పంచి కాకర్ల వెంకటరత్నం, మండల వ్యవసాయాధికారి కనకమేడల శైలజ, ఈఓ పద్మావతి, రైతులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా వేసవి విజ్ఞాన శిబిరాలు



విద్యార్థులతో గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సభ్యుడు రామారావు



ఫెన్సింగ్‌లో శిక్షణ పొందుతున్న బాలబాలికలు



కంకిపాడు గ్రంథాలయంలో స్పోకెన్ ఇంగ్లిష్‌పై విద్యార్థులకు శిక్షణ

గన్నవరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలోని ప్రథమ శ్రేణి గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం ఉత్సాహంగా జరుగుతోంది. రెండో రోజు శిబిరాన్ని మంగళవారం రోటరీ క్లబ్ అధ్యక్షుడు, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సభ్యుడు చిమట రామారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. అనంతరం పుస్తక పఠనం, కథల పోటీలు జరిగాయి. విజ్ఞానాన్ని, చదువుపై ఆసక్తిని పెంపొందించడానికి చేపట్టిన సమ్మర్ క్యాంప్‌ను విద్యార్థులు వినియోగించుకోవాలని కోరారు. గ్రంథాలయ ఇన్‌చార్జ్ దొండపాటి బాబురావు, బీడీసీ పరిమి కోటేశ్వరరావు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో..

గన్నవరం: స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో వేసవి క్రీడా శిబిరం కొనసాగుతోంది. క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో కబడ్డీ, ఫెన్సింగ్, హ్యాండ్‌బాల్ క్రీడల్లో బాలబాలికలు శిక్షణ పొందుతున్నారు. క్రీడా శిబిరాన్ని పరిసర ప్రాంత బాలబాలికలు వినియోగించుకోవాలని క్యాంప్ ఇన్‌చార్జి ధనియాల నాగరాజు కోరారు.

గన్నవరం రూరల్: గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని మండలంలోని పురుషోత్తపట్నం శాఖా గ్రంథాలయం లైబ్రేరియన్ కె.కృపానందం చెప్పారు. వేసవి శిక్షణలో భాగంగా మంగళవారం స్థానిక లైబ్రరీలో విద్యార్థులతో పుస్తకాలను చదివించే కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ కాలంలో ఫోన్‌లకు, టీవీలకు దూరంగా విద్యార్థులను ఉంచడానికి, పుస్తకాలకు దగ్గర చేయడానికి ప్రభుత్వం చేస్తున్న కృషి ప్రశంసనీయమన్నారు. తల్లిదండ్రులు తమ బిడ్డలను రోజూ లైబ్రరీకి పంపి పుస్తక పఠనాన్ని అలవాటుగా మార్చాలని కోరారు. గ్రంథాలయం అభివృద్ధి కమిటీ సభ్యులు, అన్నే కోదండరామయ్య, పాఠకులు పాల్గొన్నారు. ముస్తాబాద శాఖా గ్రంథాలయంలో లైబ్రేరియన్ కె.జ్యోతి కుమారి ఆధ్వర్యాన విద్యార్థులు పుస్తక పఠనం చేశారు.

వేసవి శిబిరాలతో విద్యార్థులకు మేలు

కంకిపాడు: వేసవి శిక్షణ శిబిరాలతో విద్యార్థులకు మేలు జరుగుతుందని స్థానిక గ్రంథాలయ అధికారి సీహెచ్ రామకృష్ణ తెలిపారు. వేసవి శిక్షణ శిబిరాల్లో భాగంగా స్పోకెన్ ఇంగ్లిష్‌పై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఆలపాటి శ్రీకాంత్, విద్యార్థులు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విమానాశ్రయంలో ఉచిత వైద్య శిబిరం



విమానాశ్రయం(గన్నవరం): విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం(గన్నవరం)లోని డొమెస్టిక్ టెర్మినల్‌లో మంగళవారం మణిపాల్ హాస్పిటల్ ఆధ్వర్యాన ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. తొలుత వైద్యశిబిరాన్ని ఎయిర్‌పోర్ట్ డైరెక్టర్ ఎం. లక్ష్మీకాంతరెడ్డి ప్రారంభించారు. అనంతరం విమానాశ్రయ అధికారులు, సిబ్బందితో పాటు వారి కుటుంబ సభ్యులకు బీపీ, షుగర్, ఆర్‌బీఎస్, ఈసీజీ, 2డీ ఎకో, ఐ స్క్రీనింగ్, పీపీ స్మెర్, మామోగ్రామ్ తదితర వైద్య పరీక్షలు చేశారు. 150 మందికి పరీక్షలు చేసి మందులు అందజేసినట్లు 'మణిపాల్' ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో ఎయిర్‌పోర్ట్ అధికారులు మాధవీరాణి, డి. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అన్నప్రసాద వితరణ

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): హనుమత్ దీక్షాపీఠంలో మంగళవారం భక్తులకు అన్న ప్రసాద వితరణ జరిగింది. తెల్లవారుజామున స్వామి వారి మూలవిరాట్‌కు పీఠాధిపతి దుర్గాప్రసాద్ స్వామిజీ పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం విశేష అలంకరణ, తమలపాకులతో అర్చన జరిగింది. ఆలయ ప్రాంగణంలోని యాగశాలలో హోమం నిర్వహించగా, పలువురు ఉభయదాతలు, భక్తులు పాల్గొన్నారు. పీఠాధిపతి దుర్గాప్రసాద్ స్వామిజీ చేతుల మీదగా భక్తులకు ప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమంలో చైతన్య తదితరులు పాల్గొన్నారు.

సత్ సాంగత్యంతో వ్యక్తిత్వ వికాసం



విజయవాడ కల్చరల్: వ్యక్తిత్వ వికాసానికి, సమాజాభివృద్ధికి ఉపయోగపడేది సత్ సాంగత్యమేనని మల్లాది ఆధ్యాత్మికవేత్త వెంకట రామనాథశర్మ తెలిపారు. సత్యనారాయణపురం మారుతీ వ్యాయామశాలలోని అభయాంజనేయ స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సుందర వైభవం, మద్రామాయణాంతర్గత హనుమత్ వైభవం అంశంగా మంగళవారం ఆయన ప్రసంగించారు. అనంతమైన ఆధ్యాత్మిక సంపద ఉందని వాటిని చదివి జీవిత గమనాన్ని మార్చుకోవాలని సూచించారు. ధర్మాధర్మ విచక్షణ కలిగి ఉండాలని తెలిపారు. నేడు ఆధునిక సమాజంలో ప్రజల్లో ఆధ్యాత్మిక భావన తగ్గుతోందన్నారు. ఏనాటికైన నిలిచేది ధర్మ ప్రవర్తనేన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

క్రీడాకారుల సంక్షేమానికి కృషి



బాక్సింగ్ కిట్‌లు అందజేస్తున్న ఎమ్మెల్యే పార్థసారథి

కంకిపాడు: క్రీడాకారుల సంక్షేమానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి అన్నారు. రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీల్లో బంగారు పతకాలు సాధించిన క్రీడాకారులకు ఎమ్మెల్యే పార్థసారథి తన సొంత ఖర్చుతో బాక్సింగ్ కిట్లను అందజేశారు. వేల్పూరులో మంగళవారం జరిగిన పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ చదువుతో పాటు ఆసక్తి ఉన్న రంగాల్లో యువత రాణించాలన్నారు. క్రీడాభివృద్ధికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందన్నారు. క్రీడాకారుల ఉజ్వల భవితకు అవకాశాలు కల్పిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచి చెన్నుబోయిన శివనాగేంద్రమ్మ, ప్రజాప్రతినిధులు, పార్టీ నేతలు పాల్గొన్నారు.

సమాజానికి గురువులే నిజమైన మార్గదర్శకులు

గణిత అవధాని డాక్టర్ సూర్యనారాయణమూర్తి



మాట్లాడుతున్న సూర్యనారాయణమూర్తి

పన్‌టౌన్(విజయవాడపశ్చిమ): సమాజానికి గురువులే నిజమైన మార్గదర్శకులని గణిత అవధాని డాక్టర్ టీఎస్‌వీఎస్ సూర్యనారాయణమూర్తి అన్నారు. కాకరపర్తి భావనారాయణ కళాశాల ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు నిర్వహించిన ఓరియంటేషన్ తరగతుల ముగింపు కార్యక్రమం మంగళవారం ఆ కళాశాల ప్రాంగణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభకు గణిత అవధాని టీఎస్‌వీఎస్ సూర్యనారాయణమూర్తి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గురువులు నిత్య విద్యార్థిగా ఉండాలని సూచించారు. నూతన సాంకేతిక విప్లవం నేపథ్యంలో బోధన పద్ధతుల్లోనూ అనేక మార్పులు వచ్చాయన్నారు. మారుతున్న కాలానుగుణంగా బోధనా పద్ధతులు అందిపుచ్చుకోవాలని సూచించారు. విద్యార్థులకు చేరువగా ఉండి వారిలో ఆత్మస్థైర్యాన్ని పెంపొందించేందుకు పాటుపడాలని కోరారు. మార్కులు మాత్రమే కొలమానం కాదని, విద్యార్థి సమగ్ర వ్యక్తిత్వ వికాసం ముఖ్యమని స్పష్టం చేశారు. ఆ దిశగా గురువులను తీర్చిదిద్దేందుకు ఈ విధమైన కార్యక్రమాలు దోహదపడతాయని పేర్కొన్నారు. కేబీఎన్ కళాశాల యాజమాన్యం కృషి అభినందనీయమన్నారు. సభకు అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు మాట్లాడుతూ విద్యార్థుల వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దటంలో, వారిని ఉత్తమ పౌరులుగా సమాజానికి అందించటంలో గురువుల పాత్ర అపూర్వమన్నారు. గణితం, విజ్ఞాన శాస్త్రాలకు సంబంధించి గురువులను తీర్చిదిద్దేందుకు ఈ ఓరియంటేషన్ తరగతులను నిర్వహించామన్నారు. వీటిని సద్వినియోగం చేసుకున్న ఉపాధ్యాయులు చొరవ అభినందనీయమన్నారు. కార్యక్రమాన్ని అధ్యాపకులు డాక్టర్ కె.రామకృష్ణ నిర్వహించారు.

ఉల్లంఘనులకు రూ.8 వేల జరిమానా

పటమట(విజయవాడతూర్పు): నగరవాసులకు ఇబ్బంది కలిగేలా ఎవరైనా వ్యవహరిస్తే చర్యలు తప్పవని మున్సిపల్ మొబైల్ కోర్టు న్యాయమూర్తి వి. విజయభాస్కరరెడ్డి తెలిపారు. పటమట సర్కిల్-3 కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మొబైల్ కోర్టులో మొత్తం 18 కేసులను విచారణ చేయగా వారి నుంచి రూ. 8,890 జరిమానా వసూలు చేశారు. వీటిలో అత్యధికంగా ట్రేడ్ లైసెన్స్ లేకుండా వ్యాపారం నిర్వహిస్తున్న వాళ్లు, విచ్చలవిడిగా పశువులను రోడ్ల పైకి వదిలివేసే వాళ్లు, రోడ్ల పై చెత్త వేసే వారున్నారు. ఆయా కేసుల్లో జరిమానా చెల్లించినవారు మరోసారి ఇలాంటి ఘటనకు పాల్పడితే చట్టప్రకారం శిక్షిస్తామని హెచ్చరించారు. హెల్త్ ఆఫీసర్ డాక్టర్ ఇక్బాల్ హుస్సేన్, శానిటరీ సూపర్‌వైజర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, శానిటరీ సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.

శానిటేషన్ మరింత మెరుగ్గా చేపట్టాలి



శానిటేషన్ సిబ్బందికి సూచనలు ఇస్తున్న దుర్గగుడి చైర్మన్ రాంబాబు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): కొండపైన, కనకదుర్గనగర్, మహామండపం పరిసరాల్లో శానిటేషన్‌ను మరింత మెరుగ్గా చేపట్టాలని దుర్గగుడి చైర్మన్ కర్నాటి రాంబాబు అధికారులను ఆదేశించారు. దుర్గగుడి చైర్మన్ రాంబాబు మంగళవారం దుర్గగుడి శానిటేషన్‌ను పరిశీలించడంతో పాటు ప్రసాదాల కౌంటర్లను తనిఖీ చేశారు. తొలుత కనకదుర్గనగర్‌కు చేరుకున్న రాంబాబు అక్కడ డ్రెయినేజీ పరిశీలించారు. టాయిలెట్స్‌ను శుభ్రంగా ఉంచాలన్నారు. భక్తుల నుంచి డబ్బులు వసూళ్లకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. కొండపై నటరాజ స్వామి వారి ఆలయం వద్ద ప్రసాదాల విక్రయ కౌంటర్లను పరిశీలించారు. ప్రసాదాల కౌంటర్లలో పులిహోర ప్రసాదంను ఎప్పటికప్పుడు భక్తులకు అందుబాటులో ఉంచాలని సూచించారు.

గడప గడపకూ సంక్షేమం

ఎమ్మెల్యే పార్థసారథి



వేల్పూరులో సంక్షేమ పథకాల బ్రోచర్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పార్థసారథి

కంకిపాడు: ప్రతి గడపకు సంక్షేమ పథకాలు అందజేసిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి అన్నారు. వేల్పూరులో మంగళవారం 'గడప గడపకు మన ప్రభుత్వం' జరిగింది. ఎమ్మెల్యే ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమ పాలన వివరించారు. ప్రజా సమస్యలు తెలుసుకుని, ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధితో రూపొందించిన సంక్షేమ బ్రోచర్లను పంపిణీ చేశారు. స్థానిక సమస్యలపై ఆయా శాఖల అధికారులతో సమీక్షించి, పరిష్కారానికి ఆదేశించారు. పార్థసారథి మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థతో సంక్షేమ పాలనను ప్రభుత్వం గ్రామ స్థాయికి తీసుకు వచ్చిందన్నారు. రాజకీయాలకు అతీతంగా అన్ని వర్గాలకూ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని చెప్పారు. ప్రజల సంతృప్తికర స్థాయి పెంపునకు సీఎం జగన్ ఆహర్నిశలు శ్రమిస్తున్నారని తెలిపారు. ప్రతిపక్షాలు రాష్ట్ర ప్రభుత్వంపై దుమ్మెత్తి పోస్తూ బూటకపు ప్రచారాలను ప్రజల్లోకి తీసుకెళ్తున్నాయని విమర్శించారు. ప్రతిపక్షాలకు చెంపపెట్టుగా రాబోయే ఎన్నికల్లో ప్రజల తీర్పు ఉండాలని ఆకాంక్షించారు. తొలుత కొత్తగా ఏర్పాటుచేసిన వైఎస్సార్ సీపీ జెండా దిమ్మెను ఏఎంసీ చైర్మన్ మద్దాలి రామచంద్రరావు ఆవిష్కరించారు. కార్యక్రమంలో సర్పంచి చెన్నుబోయిన శివనాగేంద్రమ్మ, ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు బాకీబాబు, దుర్గగుడి బోర్డు మాజీ సభ్యుడు నెరుసు సతీష్, పార్టీ నాయకులు చెన్నుబోయిన సుబ్బారావు, చెన్నుబోయిన జయరావు, కొఠారి సాంబశివరావు, గోగులమూడి నాగేశ్వరరావు, ముసలయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రతి గింజను కొనుగోలు చేయాలి



తాడిగడపలో మొక్కజొన్న కొనుగోలు వివరాలు అడిగి తెలుసుకుంటున్న జేసీ అపరాజితాసింగ్

పెనమలూరు: ప్రతి గింజను కొనుగోలు చేయాలని అధికారులను జేసీ అపరాజితాసింగ్ ఆదేశించారు. వర్షాలకు తడిసిన మొక్కజొన్న పంటల కొనుగోలు కేంద్రాన్ని తాడిగడపలో జిల్లా జాయింట్ కలెక్టర్ అపరాజితాసింగ్ మంగళవారం పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ పంట పొలాల్లోకి వెళ్లి క్షేత్రస్థాయిలో పంటలు పరిశీలించి పంట నష్టం నమోదు చేయాలని సూచించారు. నష్టం నమోదులో లోపాలు ఎదురుకాకుండా ఉండాలన్నారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ డీఎం మురళి, తహసీల్దార్ టీవీ సతీష్, ఆర్ఐ భరద్వాజ్, వీఆర్వో మనోజ్, సిబ్బంది పాల్గొన్నారు.

పంట నష్టం పరిశీలన

పెనమలూరు: అకాల వర్షాల కారణంగా పెనమలూరులో దెబ్బతిన్న మొక్కజొన్న పంటను మండల వ్యవసాయ సలహామండలి వైస్ చైర్మన్ కొడాలి శ్రీధర్ పరిశీలించారు. ఆయన మంగళవారం మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాల కారణంగా మొక్కజొన్న పంట తడవటంతో బూజు పట్టిందన్నారు. ప్రభుత్వం రైతులకు న్యాయం చేస్తుందని తెలిపారు. రైతులు పంట నష్టాన్ని సక్రమంగా నమోదు చేయించుకోవాలని సూచించారు. రైతులు ఇబ్బందులు తొలగించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సలహామండలి అధ్యక్షుడు కిలారు మోహన్‌రావు, వీఆర్వో నాగేశ్వరరావు, అగ్రికల్చర్ అసిస్టెంట్ పవన్ పాల్గొన్నారు.

మద్యం పార్టీలో తగాదా కారణంగానే ఘర్షణ

అజయ్ సాయి హత్య కేసులో డీఎస్పీ జయసూర్య వివరణ



విలేకరులకు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ జయసూర్య

పెనమలూరు: మిత్రులు మద్యం తాగిన సమయంలో తలెత్తిన ఘర్షణ కారణంగానే చెన్నూరి అజయ్ సాయి మృతి చెందాడని గన్నవరం సర్కిల్ డీఎస్పీ ఆర్‌జే జయసూర్య తెలిపారు. ఆయన పెనమలూరు పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. తాడిగడపకు చెందిన చెన్నూరి అజయ్‌సాయి ఐదుగురు మిత్రులతో కలిసి ఈ నెల 7వ తేదీన రామవరప్పాడులోని ఒక అపార్టుమెంట్‌లో మద్యం పార్టీ చేసుకున్నారని తెలిపారు. ఉదయం నుంచి రాత్రి వరకు వారు మద్యం తాగారన్నారు. పార్టీలో ఉన్న మణికంఠస్వామి ఐ ఫోన్ ఇయర్ బడ్స్ పోవటంతో అజయ్‌సాయిపై అనుమానం వచ్చి ప్రశ్నించగా, తాను బడ్స్ తీసి పక్కన పడేశానని చెప్పడంతో పార్టీలో ఉన్న మిత్రులందరూ ఆగ్రహంతో అజయ్‌సాయిపై దాడి చేసి తీవ్రంగా కొట్టారన్నారు. ఈ ఘటనలో గాయపడిన అతనిని పటమటలో ఆస్పత్రిలో చేర్చగా చికిత్స పొందుతూ మృతి చెందాడని డీఎస్పీ తెలిపారు. ఈ ఘటనపై విచారణ చేస్తున్నామని, నిందితులను అరెస్టు చేస్తామని చెప్పారు.

హత్య కేసు నమోదు

అజయ్‌సాయి మృతిపై పోలీసులు హత్య కేసు నమోదు చేశారు. మృతుడి తండ్రి గణేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు స్వామి, సాయినాగార్జున, శ్రీధర్, ప్రశాంత్, మణికంఠ్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో ఇద్దరు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారని సమాచారం. పరారీలో ఉన్న మిగతా నిందితుల కోసం పోలీసులు గాలిస్తున్నారు.

'వీకేఆర్' పూర్వ విద్యార్థుల సమ్మేళనం



వీకేఆర్ కళాశాల యాజమాన్య కమిటీ కోశాధికారి రాధాసుబ్బారావును సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

గన్నవరం: కేసరపల్లి శివారు వీకేఆర్ కళాశాలలో మంగళవారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఉత్సాహంగా జరిగింది. కళాశాలలో 1974 బ్యాచ్ పూర్వ విద్యార్థులు సుమారు 49 ఏళ్ల తర్వాత ఒక వేదికపై కలుసుకున్నారు. ఆనాటి జ్ఞాపకాలను, గురువులతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. పూర్వ విద్యార్థి టీఎస్‌ఆర్‌కే ప్రసాద్ మాట్లాడుతూ ఈ ప్రాంత విద్యాభ్యున్నతికి వేములపల్లి కోదండరామయ్య స్థాపించిన ఈ కళాశాల వేలాది మందిని ఉన్నతులుగా తీర్చిదిద్దిందన్నారు. అనంతరం కళాశాల కరస్పాండెంట్ పీవీ రత్నప్రసాద్, కళాశాల యాజమాన్య కమిటీ కోశాధికారి గూడవల్లి రాధాసుబ్బారావును పూర్వ విద్యార్థులు సత్కారించారు. విశ్రాంత అధ్యాపకులు గన్నె వెంకట్రావు, డి. సీతారామస్వామి, రాంప్రసాద్, కళాశాల ప్రిన్సిపాల్ డి. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతుల హక్కుల పరిరక్షణ బోర్డు సభ్యుడిగా వెంకట్



సంకాబత్తుల వెంకట్

గన్నవరం: విభిన్న ప్రతిభావంతుల హక్కుల పరిరక్షణ ప్రభుత్వ సంస్థల జిల్లా సలహా బోర్డు సభ్యులుగా గన్నవరానికి చెందిన హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ చైర్మన్ సంకాబత్తుల వెంకట్ నియమితులయ్యారు. మంగళవారం కలెక్టర్ పి.రాజాబాబు నియామక ఉత్తర్వులను జారీచేశారు. ఈ సందర్భంగా వెంకట్ మాట్లాడుతూ హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ ద్వారా దివ్యాంగుల అభ్యున్నతికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. తన సేవలను గుర్తించి కలెక్టర్ చైర్మన్‌గా ఉన్న బోర్డులో స్థానం కల్పించడం బాధ్యతలను మరింతగా పెంచిందన్నారు. రెండేళ్ల కాల పరిమితి కలిగిన ఈ బోర్డులో ప్రతి ఆరు నెలలకు ఒకసారి సమావేశమై విభిన్న ప్రతిభావంతుల సమస్యలపై చర్చించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామన్నారు. వెంకట్‌ను పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు అభినందించారు.